క్లుప్తంగా

బస్సు షెల్టర్‌ను పునర్నిర్మించాలి



మాట్లాడుతున్న పాకల సన్యాసిరావు

పార్వతీపురం టౌన్: ప్రజలకు అవసరమైన బెలగాం బస్సు షెల్టర్‌ను పునర్నిర్మించాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం అధ్యక్షుడు పాకల సన్యాసిరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యవంతంతగా ఉన్న చరివీధి సమీపంలోని బస్సు షెల్టర్‌ను ఇటీవల తొలగించడంతో ఇబ్బందులకు గురవుతున్నారని బస్సుషెల్టర్‌ను పునర్నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో గొర్లి వెంకటరమణ, ఎం వెంకటరమణ, హనుమంతు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ రాత పరీక్ష

- 241 మంది అభ్యర్థులు హాజరు



పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ప్రయాగమూర్తి

సీతానగరం: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌కాలేజీలో ఆదివారం జరిగిన కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశాంతంగా జరిగిందని నిర్వాహకులు ఎస్సై (సాలూరు,రూరల్) ప్రయాగమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సాలూరు సీఐ శ్రీనివారావు పర్యవేక్షణలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్ష ప్రశాంతగా జరిగినట్లు చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 250 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 241 మంది హాజరైనట్లు తెలియజేశారు.

పోలమాంబను దర్శించుకున్న భక్తులు



అమ్మవారి ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారిని ఆదివారం అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మను దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. పలువురు మహిళలు అమ్మవారి ఘటాలకు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అలాగే వనంగుడిలో ఉన్న పెదపోలమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకొని, వేపచెట్లకు పూజలు నిర్వహించారు.

ఎస్పీ, అదనపు ఎస్పీలకు రీజనల్ కోఆర్డినేటర్ కృతజ్ఞతలు



ఎస్పీ విద్యాసాగర్‌నాయుడిని సత్కరిస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ చలపతి రావు

పార్వతీపురం టౌన్: పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల పరీక్షలు పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రశాంతంగా జరిగేందుకు వారం రోజులుగా సహకరించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్‌లకు పరీక్షల రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ చలపతిరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం సాయంత్రం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో మొదటిసారి 19 కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా పరీక్ష నిర్వహించినందుకు పోలీసు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పాలకొండ: వాహన చోదకులు రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు అతిక్రమించేవారిపై చర్యలు తప్పవని డీఎస్పీ కృష్ణారావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పోలీసు సిబ్బంది రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై ప్రజలు, వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన, మైనర్లకు వాహనాలు ఇచ్చినా వాహనాలు సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు.

జిల్లా స్త్రీనిధి మహిళా కోఆపరేటివ్ డైరెక్టర్‌గా లక్ష్మి

గరుగుబిల్లి: జిల్లా స్త్రీనిధి మహిళా కోఆపరేటివ్ డైరెక్టర్‌గా వైఎస్సార్ క్రాంతి పథం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంట లక్ష్మి ఎంపికయ్యారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్త్రీనిధి మహిళా కోఆపరేటివ్ డైరెక్టర్లను ప్రభుత్వం నియమించింది. పార్వతీపురం మన్యం జిల్లా స్త్రీనిధి మహిళా కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా గరుగుబిల్లి మండలం రావివలస గ్రామానికి చెందిన గంట లక్ష్మికి పదవి వరించింది.

ఉపాధ్యాయులు నిబంధనలు పాటించాలి

- యాప్‌లోనే హాజరు నమోదు చేయాలి
- విద్యాశాఖ అధికారులు



బలిజిపేట ఉన్నత పాఠశాల

బలిజిపేట:

పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని విద్యాశాఖ అధికారులు వెబినార్‌లో సూచించినట్లు డిప్యూటీ డీఈఓ బ్రహ్మజీ రావు తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉదయం నుంచి పాఠశాల ముగిసే వరకు వారి విధానాలు నిర్ధారించి వాటిని పక్కాగా అమలు చేయాలని అందజేసిన సూచనలు ఇలా ఉన్నాయి.

- ఉదయం 9గంటల లోపు ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరై, ఫేస్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాలి.
- ఉదయం 10.30 గంటలకు పిల్లల హాజరును స్టూడెంట్ యాప్‌లో నమోదు చేయాలి.
- పాఠశాలల ప్రారంభం నాటికి బియ్యం, పప్పులు, గుడ్లు, చెక్కీలు సిద్ధంగా ఉంచాలి.
- ఎండీఎం (జగనన్న గోరుముద్ద) రికార్డులు అప్‌డేట్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి.
- మధ్యాహ్న భోజనాన్ని కచ్చితంగా గ్యాస్ స్టౌ మీదే తయారుచేయాలి.
- ఎండీఎం అటెండెన్స్ ఉదయం 11గంటల్లోగా సబ్‌మిట్ చేయాలి.
- అన్ని వివరాలను ఎంతఓలు మధ్యాహ్నం 2 గంటల్లోపు ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయాలి.
- సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు మధ్యాహ్న భోజన పథకాన్ని సందర్శించేలా సూచనలు వారికి అందించాలి.
- నిర్ధారిత మెనూ బోర్డును ప్రదర్శించి దానిని కచ్చితంగా అమలు చేసేలా చూడాలి.
- తరగతి గదిలో విద్యార్థులందరి వద్ద అచ్చు పుస్తకాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- మ్యాపింగ్ అయిన పాఠశాలల్లో ఇది కచ్చితంగా అమలు జరగాలి.
- సమ్మేటివ్ అసెస్మెంట్ జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తిచేయాలి.
- విద్యార్థులు రాసిన జవాబు పత్రాలను వారికి ఇచ్చి వారు చేసిన తప్పులు సరిదిద్దాలి. సరైన సమాధానం వారికి తెలియచేయాలి.
- ఉపాధ్యాయులందరి వద్ద పాఠ్య ప్రణాళికలు, ఈనెల సిలబస్‌కు అనుగుణంగా డైరీలు, తరగతి గదిలో బోధన సమయంలో ఉండాలి.
- ట్యాబ్‌ల ద్వారా ప్రారంభించిన బోధనలో నేటి వరకు పిల్లలు నేర్చుకున్న అంశాలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉండాలి.
- లిప్‌కు సంబంధించిన మాడ్యుల్స్ అందుబాటులో ఉంచి, వాటి ప్రకారం బోధన చేస్తూ పిల్లల సామర్థ్యాన్ని గుర్తించి సదరు సమాచారాన్ని రికార్డు రూపంలో పొందుపరచాలి.
- టీఏఆర్‌ఎల్‌కు సంబంధించి పాఠశాలలకు అందజేసిన టీఎల్‌ఎంలను వినియోగిస్తూ పిల్లల సామర్థ్యాన్ని గుర్తించి, రికార్డుల రూపంలో పొందుపరచాలి.
- పాఠశాలలో రక్తహీనత గల పిల్లల వివరాలు, సమస్య నివారణకు తీసుకుంటున్న చర్యల సమాచారం అందుబాటులో ఉండాలి.
- అందరు పిల్లలు యూనిఫాం ధరించి, షూస్ వేసుకుని జగనన్న విద్యా కానుక కిట్లతో పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి.
- నాడునేడు పాఠశాలల్లో పనులన్నీ ప్రారంభమయ్యేటట్లు చర్యలు చేపట్టి, రికార్డులు, రిజిస్టర్లను అప్‌డేట్ చేయాలి, వర్క్ ఇన్ ప్రోగ్రెస్ బోర్డులు ఏర్పాటు చేయాలి.
- పాఠశాలల్లోని తరగతి గదుల్లో అచ్చు పుస్తకాలు, జేవీకే మెటీరియల్ గుట్టలుగా పడిఉంటే చర్యలు తప్పవు.
- ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించాలి.
- లెర్న్ ఎ వర్డ్ ఎ డే రోజూ చెప్పాలి.
- 6–9గరగతి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు నేర్పాలి.
- హెల్త్ కాంపెయిన్‌లు జరగాలి.
- బైజూస్ కంటెంట్‌పై అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన ఉండాలి.

నిబంధనలు తప్పనిసరి



వెబినార్ ద్వారా సూచించిన నిబంధనలు పాఠశాలల్లో పక్కాగా అమలు చేయాలి. ఉపాధ్యాయులు ఎటువంటి పరిస్థితులలో నిబంధనలు తప్పకూడదు. సమయపాలన పాటించాలి.

–బ్రహ్మజీరావు, డిప్యూటీ డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సూర్యారావు

పార్వతీపురం టౌన్: వినియోగదారులంతా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు సూచించారు. ఈ మేరకు ఆదివారం వినియోగదారుల మండలి సమావేశాన్ని జిల్లా కేంద్రం పార్వతీపురంలోని వినియోగదారుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలలో రెండు రోజులు అన్ని గ్రామాల్లో పర్యటించి వినియోగదారుల రక్షణ, వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. పట్టణంలో ప్రతి శనివారం సాయంత్రం 6గంటల నుంచి వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదులను స్వీకరిస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సీనియర్ సిటిజన్లకు ఆర్టీసీ బస్సుల్లో 25శాతం రాయితీ కల్పించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. జనరల్ సెక్రటరీ మాన్యం రామకృష్ణ, అప్పలరాజు పాల్గొన్నారు.

జాబ్‌కార్డులున్న వారందరికీ ఉపాధి పనులు



పెదంకలాం వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న జేఈ కృష్ణ

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కావలసిన వేతన దారులందరికీ కల్పిస్తామని ఎన్ఆర్ఈజీఎస్ జేఈ కృష్ణ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో నీరులేని చెరువులు, గోర్జలు, గట్ల పనుల్లో ఇప్పటి వరకూ రోజుకు 1891 మంది వేతన దారులు పాల్గొంటున్నారని తెలియజేశారు. సోమవారం నుంచి రోజుకు 3 వేలమంది వేతనదారులు పనుల్లో పాల్గొడానికి అవకాశం కల్పిస్తామన్నారు. వేతన దారులందరూ చిన్న, సన్నకారు రైతులు కావడంతో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టాయని, జాబ్ కార్డులున్న వారంతా ఉపాధి పనుల్లో పాల్గొంటారన్నారు. అలాగే ఎంపీడీఓ బి కృష్ణ మహేష్‌రెడ్డి సూచనల మేరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలియజేశారు. జరుగుతున్న పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

ఆందోళన చెందొద్దు: ఏపీఎం



సభ్యులతో మాట్లాడుతున్న ఏపీఎం భవానీ

భామిని: బత్తిలిలో మహిళా సంఘాల సభ్యులతో వెలుగు ఏపీఎం దొడ్ల భవానీ, ఏపీజీవీబీ ఎఫ్ఓ గోపీకృష్ణ ఆదివారం సమావేశమయ్యారు. సంఘ సభ్యుల బ్యాంక్ ఖాతాలను హోల్డ్‌లో పెట్టడంతో ప్రభుత్వం మంజూరు చేసిన సున్నావడ్డీ డబ్బులు పొందలేకపోయామని సభ్యులు వాపోయారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు హోల్డ్‌లో పెట్టిన ఖాతాలను రిలీవ్ చేసినట్లు ఎఫ్ఓ గోపీకృష్ణ తెలిపారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఏపీజీవీబీ అధికారుల మధ్య సమన్వయకర్తగా ఉంటానని, సభ్యుల సమస్యలు పరిష్కరిస్తానని ఏపీఎం భవానీ వారికి సర్ది చెప్పారు.

ఏడో వార్డులో టిడ్కో చైర్మన్ పర్యటన



ప్రజలతో చర్చిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురం: పార్వతీపురం పురపాలక సంఘంలోని ఏడోవార్డులో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఆదివారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్నాలు సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా? లేదా అని ప్రజలను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ప్రతి పేదవాడికి సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం టిడ్కో ఇళ్లను మంజూరు చేస్తుందని చెప్పారు. పేదల ప్రభుత్వమైన మన జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే

- మాఘమాసంలో మొదలైన పెళ్లిళ్ల సందడి



పార్వతీపురం: ప్రతి ఒక్కరి జీవితంలో మరిచిపోలేని ఘట్టం పెళ్లి. పెళ్లి ఎప్పుడు చేసుకోవాలంటే ఎవరైనా వెంటనే చెప్పేది మాఘమాసంలో అని. ఎందుకంటే పెళ్లిళ్లకు పెట్టింది పేరు మాఘమాసం. ఈ మాసంలో ఉన్నంత బలమైన ముహూర్తాలు మరో మాసంలో ఉండవని పురోహితులు చెబుతున్నారు. అందుకే అందరూ పెళ్లిళ్ల చేసుకునేందుకు అత్యధిక ప్రాదాన్యం ఇస్తారు. ఈ మాసంలో పెళ్లిళ్ల చేసుకుంటే దాంపత్య జీవితం నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో ఉంటుందని పురోహితులు చెబుతున్నారు. ఈ మాసంలో పదకొండు ముహూర్తాలు ఉండడంతో వేలాది జంటలు మాంగల్య బంధంతో ఒక్కటి కానున్నాయి. ఈనెల 25, 26, 27, 28, ఫిబ్రవరి 1, 8, 9, 10, 11, 12, 15 తేదీవరకు మంచి ముహూర్తాలని పండితులు చెబుతున్నారు. దీంతో పార్వతీపురం పట్టణంలోని కల్యాణ మంటపాలు, పురోహితులు, మంటపాలు వేసేవారు, క్యాటరింగ్, షామియానా, కార్ ట్రావెల్స్‌కు డిమాండ్ పెరిగింది. ఈ కారణంగా వాటి ధరలకు రెక్కలొచ్చాయి. తరువాత వచ్చే ఫాల్గుణ మాసం శూన్యమాసమని, ఆతరువాత మార్చి 29నుంచి ఏప్రిల్ 25 వరకు గురుమౌఢ్యమి కారణంగా పెళ్లిళ్ల జరగవని పురోహితులు చెబుతున్నారు.

తొలగిన రహదారి కష్టాలు..

- మంత్రి రాజన్నదొర చొరవతో మామిడిపల్లి – శంబర రోడ్డు పూర్తి



నూతనంగా వేసిన తారు రోడ్డు



అధ్వానంగా ఉన్న మామిడిపల్లి - శంబర రోడ్డు (ఫైల్)

సాలూరు: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు రహదారి కష్టాలు తీరాయి. కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరకు ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. గతంలో మామిడిపల్లి నుంచి శంబర వరకు రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది పడేవారు. గుంతలు, రాళ్లు తేలిన రహదారి మీద రాకపోకలు సాగించడం కష్టంగా ఉండేది. ప్రతి ఏడాదీ జాతర సమయంలో రహదారికి మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకునేవారు. ఎట్టకేలకు డిప్యూటీ సీఎం రాజన్నదొర చొరవతో పీఆర్ ప్రాజెక్ట్ ద్వారా రూ.8.54 కోట్లతో మామిడిపల్లి నుంచి శంబర మీదుగా మక్కువ వరకు రోడ్డు వేశారు. రహదారి ఇబ్బందులు తీర్చిన మంత్రికి ప్రజలు, భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పకడ్బందీగా గోరుముద్ద పర్యవేక్షణ

సీతంపేట: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పేరిట అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా మధ్యాహ్న భోజనం వండుతున్న సమయంలో ఉదయం 10 నుంచి 11.30 గంటల మధ్య గ్రామ సచివాలయ సిబ్బంది, పేరెంట్ కమిటీ, హెచ్ఎం, ఉపాధ్యాయులు పర్యవేక్షించాల్సి ఉంది. యూపీ, ప్రైమరీ పాఠశాలల్లో సోమవారం గ్రామ వలంటీర్, మంగళవారం వెల్ఫేర్ అసిస్టెంట్, బుధవారం పేరెంట్ కమిటీ చైర్మన్, గురువారం గ్రామ వలంటీర్, శుక్రవారం విలేజ్ ఆర్గనైజర్, శనివారం పేరెంట్ కమిటీ చైర్మన్ పరిశీలించాలి.

నవరత్నాలతో పేదలందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబానికి వివిధ శాఖల ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పక్కాగృహాలు, ఇళ్ల స్థలాల లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం సచివాలయం పరిధి ఏగోటివలసలో సర్పంచ్ రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు టి.పార్వతి, స్థానిక నాయకులు పి.రాము, సీహెచ్ సురేష్‌ల ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావును ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఏగోటివలస గ్రామ పెద్దలు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జోగారావు ప్రారంభించి గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అందించిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు పొందడానికి అర్హత ఉండి ఇంకా ఏమైనా పథకాలు అందకుంటే వాటి వివరాలు అడిగి తెలుసుకుని అధికారుల సమక్షంలో అక్కడికి అక్కడే సమస్యలను పరిష్కరించారు.

గ్రామాభివృద్ధికి కృషి

ఏగోటివలస గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సమాజిక పరమైన అవసరాలు తీర్చడానికి సత్వరచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొక్కసారి సీఎంగా సేవలందించడానికి ప్రజలంతా ఆశీర్వదించి దీవించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పి ఈశ్వరనారాయణ, మాజీ ఎంపీపీ కె.రత్నాకర్, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ హోదాల్లో సేవలందిస్తున్న పార్టీ శ్రేణులు, ఎంపీడీఓ బి కృష్ణమహేష్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మా బాబు జగనన్న చల్లగుండాలి



బుక్‌లెట్‌పై జగనన్న ఫొటో చూసి మురిసిపోతున్న గంగమ్మ

మండలంలోని ఏగోటివలసలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను గ్రామంలోని వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు గంగమ్మకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు అందజేసి జగనన్నను దీవించాలని కోరారు. ఈ సందర్భంగా గంగమ్మ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తనను రూ.2,750 పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్న జగనన్నకు ఓటు వేసి రుణం తీర్చుకుంటానని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫొటో చూసి మురిసిపోతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో చెబుతున్న దృశ్యమిది.

పరిమితమే హితం

- రబీలో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి
- మోతాదుకు మించితే దిగుబడిపై ప్రభావం



పొలంలో ఎరువులు వేస్తున్న రైతు (ఫైల్)

భామిని:

ఖరీఫ్ వరి పంట చేతికందడంతో రైతులు రబీ సాగుకు సిద్ధమయ్యారు. సాగునీటి కాలువలు, వ్యవసాయ బోర్లు ఉన్న చోట్ల యాసంగి పంటగా వరి సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం దమ్ములు, నారుమడులు వేసుకోవడంలో బిజీగా ఉన్నారు. అయితే వరినారు మడుల్లో, దమ్ములో పరిమితికి మించి ఎరువులు వినియోగించడం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు పంట దిగుబడిపై ఆ ప్రభావం పడుతుంది. ఖరీఫ్‌తో పోల్చుకుంటే రబీలో తక్కువ పరిమాణంలో ఎరువులు వినియోగించాలి. రబీలో ఎరువులు, కలుపు నివారణలో తీసుకోవాల్సిన యాజమన్య పద్ధతులను వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

దమ్ములో మొదటి విడతగా..

పాలకొండ నియోజకవర్గంలో భామిని, సీతంపేట, వీరఘట్టం, పాలకొండ మండలాల్లో నీటి వసతులు ఉన్న ప్రాంతాల్లో రబీలో స్వల్పకాలిక వరి పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం దమ్ములు చేపడుతుండడంతో దమ్ము సమయంలో ఎరువుల వినియోగంపై వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. దమ్ము సమయంలో మొదటి విడతగా ఎకరాకు రెండు బస్తాల సూపర్‌ఫాస్ఫేట్, అరబస్తా పొటాష్, అరబస్తా యూరియా వేసుకోవాలి. పరిమితికి మించి ఎరువులు వేసుకోవడం ద్వారా సాగు ఖర్చు పెరగడంతో పాటు నేల చౌడుగా మారిపోయి దిగుబడి తగ్గుతుంది. మోతాదులో ఎరువులు వేయడం వల్ల గింజ సైజు పెరగడంతో పాటు గట్టితనం, బరువు వస్తుంది.



రబీ వరిసాగుకు పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

మలి విడతలో..

వరినాట్లు పూర్తయిన 25 నుంచి 30 రోజుల్లో (పిలక దశలో) రెండో దఫాగా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది. ఎకరాకు అరబస్తా యూరియా, 15 కిలోల పొటాష్ కలిపి వేసుకోవాలి. వరి వెన్నులు వేసి పాలుపోసుకునే దశలో మూడో దఫాగా 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేసుకోవాలి.

కలుపు నివారణ చర్యలు

వరినారు ముప్పై రోజుల్లోపు నాటుకోవాలి. నాటిన మూడో రోజు కలుపు నివారణకు ఎకరాకు 35 గ్రాముల ఆక్సాడై యాజిల్ మందును 20 కిలోల ఇసుకతో కలిపి చేనులో చల్లుకోవాలి. దీని వల్ల 20–25 రోజుల వరకు కలుపు ఉండదు. గడ్డిజాతి కలుపు నివారణకు రేపఫ్‌గా పిలిచే కించర్ 250 మి.లీ మందును 9 ట్యాంకుల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– కె.రత్నకుమారి, ఏడీఏ, పాలకొండ